క్లుప్తంగా

టీబీపై అవగాహన



టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మెళియాపుట్టి: టీబీ వ్యాధిపై ఆందోళన వద్దని, నిర్మూలనకు జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని సూపర్‌వైజర్ పొట్నూరు చిరంజీవి అన్నారు. సోమవారం కరజాడ పీహెచ్‌సీ పరిధిలోని మర్రిపాడు–కె గ్రామంలో టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. టీబీ వ్యాధిగ్రస్తులు సమయానుకూలంగా మందులు వాడాలని, లేకపోతే ఎండీఆర్ టీబీగా మారే అవకాశం ఉందన్నారు. హెచ్‌వీ చిన్నమ్ములు, సీహెచ్‌ఓ జ్యోతి, ఏఎన్‌ఎం తులసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

హిరమండలం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజా అన్నారు. ఎల్.ఎన్.పేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీల పురోగతిపై సోమవారం గ్రామ సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలు స్వయం ప్రతిపత్తి కేంద్రాలుగా మారాలని, సొంతంగా అభివృద్ధి చెందే సామర్థ్యాలు కలిగి ఉండాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ముందస్తు ప్రణాళికలు వేయాలని, అక్షరాస్యత శాతాన్ని పెంచాలన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నిధులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలన్నారు. ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఈశ్వరమ్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

సారవకోట: నవ ధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ రమణ సూచించారు. మండలంలోని గుమ్మపాడు పంచాయతీ అక్కివలస గ్రామంలో రైతు బమ్మిడి నాగరాజుకు చెందిన రెండెకరాల నవ ధాన్యాల సాగులో సోమవారం పంటకోత ప్రయోగం చేపట్టారు. నవ ధాన్యాలను సాగు చేయడం వలన ఖరీఫ్‌లో సాగు చేసుకున్న పంటలకు కావాల్సిన అన్ని పోషకాలు అందిస్తుందన్నారు. ఐదు టన్నుల పచ్చిరొట్టను సాగు చేస్తే 10 టన్నుల బయోమాస్ తయారవుతుందని, ఇది నేలకు, పంటలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు అందజేయండి

సారవకోట: ఉపాధి హామీ పథకం ద్వారా సపోట మొక్కలు అందించాలని గొర్రిబంద పంచాయతీ కోనవానిపేట గిరిజన రైతులు కోరారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయానికి సోమవారం వెళ్లి సిబ్బందిని కలిశారు. ఇటీవల మండలంలో ఉపాధి పథకంలోని ఉద్యానవనశాఖ ద్వారా మొక్కలు పంపిణీ చేశారన్నారు. అందులో తమకు మొక్కలు అందించలేదన్నారు. కొండ ప్రాంతాల్లో తాము సాగు చేస్తున్నామని, సపోట మొక్కలు తమకు అందజేయాలని విన్నవించారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీకి అనుకొని ఉన్న వంశధార వరద కాలువపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులకు గొంటి రమేష్‌తోపాటు పలువురు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై అధికారులు విచారణ చేపట్టారు. వరద కాలువ గట్టుపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని సోమవారం హెచ్చరిక బోర్డును వీఆర్‌ఏ ద్వారా ఏర్పాటు చేయించారు.

విద్యుత్ మీటర్లు తొలగించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీలో గల 308 ప్లాట్ నంబర్‌కు అనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాల్లో షాపులు నిర్మించి అక్రమంగా విద్యుత్ మీటర్లు పొందిన రౌతు రఘు, మరో పది మందిపై చర్యలు తీసుకోవాలని అదే కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎంపీడీఓ నీరజకు ఫిర్యాదు అందజేశారు. ఆర్‌ఆర్ కాలనీలో ఉన్న రిజర్వ్ స్థలాల్లో కొంతమంది అక్రమ పట్టాలు పొంది షాపులు నిర్మించారన్నారు. వాటికి తప్పుడు పట్టాలు చూపించి మీటర్లు పొందారన్నారు. షాపుల నిర్మాణంపై ఇదివరకే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ విద్యుత్ మీటర్లు మంజూరు చేశారన్నారు. మీటర్లను స్వాధీనం చేసుకోవాలన్నారు.

శివారు భూములకు..

సాగునీరు ప్రశ్నార్థకమే..!



అలమాజీపేట వద్ద ఎండిపోతున్న వరి నారు

- ఓపెన్‌హెడ్ ఛానల్‌లో చుక్క నీరు లేని వైనం
- 1200 ఎకరాలకు అందని సాగునీరు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

సరుబుజ్జిలి: ఖరీఫ్ సీజన్‌లో వరి వెదలు, నారు మడులు ఇప్పటికే వేశారు. ఈ ఏడాది వర్షాలు అంతగా అనుకూలించలేదు. యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ ఛానల్‌లో మరమ్మతులు చేపట్టకపోవడంతో దిగువన ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. దీనివలన పాలవలస, పెదవెంకటాపురం, పెద్దపాలెం, చిన్నపాలెం, పురుషోత్తపురం, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట గ్రామాలకు సంబంధించిన సుమారు 1200 ఎకరాల ఆయకట్టుకు సంబంధించిన వరి వెదలు, వరి నారు మడులు ఎండిపోతోంది. దమ్ము కోసం ఉంచిన వరినారు పొలాలు కూడా నీరులేక గిడస బారుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువ పనులు ఆశించిన స్థాయిలో లేకపోవడం వలన సాగునీరు శివారు భూములకు అందడం కష్టంగా ఉంది. అధికారులు స్పందించి సాగునీటిని శివారు భూములకు అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



పెద్దపాలెం సమీపంలో ఎండుతున్న వరి వెద పొలాలు



పిచ్చి మొక్కలతో నిండిన ఓపెన్‌హెడ్ ఛానల్

చుక్కనీరు అందని పరిస్థితి..



ఛానల్‌లో అరకొరగా పనులు చేయడంతో శివారు ప్రాంతాల్లో ఉన్న భూములకు సాగునీరు అందడం కష్టంగా ఉంది. చాలావరకు షట్టర్లు, చెక్ డ్యామ్‌లు మరమ్మతులు చేయకపోవడం వలన సాగునీటి ప్రవాహం కష్టమవుతోంది.

– బి.రామారావు, రైతు, పెద్దసవలాపురం

అధికారుల పర్యవేక్షణ ఉండాలి



కాలువల నిర్వహణ పట్ల అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాలి. దీంతో క్షేత్రస్థాయిలో సమస్యలను సులువుగా గుర్తించి పరిష్కరించవచ్చు. పంట ఆఖరి రోజుల్లో సాగునీటికి రైతులు నానా కష్టాలు పడుతున్నారు.

– పి.తవిటినాయుడు, రైతు, మర్రిపాడు

సాగునీరు అందేలా చూస్తాం

కాలువల ద్వారా శివారు భూముల వరకు సాగునీరు అందించేలా అన్ని రకాల చర్యలూ తీసుకుంటాం. కొన్నిచోట్ల పూడికతీత పనులు కూడా చేపట్టడం జరిగింది. కాలువల అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకుంటాం.

– శోభన్‌బాబు, ఓపెన్‌హెడ్ ఛానల్ జేఈ

మహిళలకు రక్షణ లేదు



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న చింతాడ రవికుమార్, మహిళలు

- కృష్ణా జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ హారికపై దాడి అమానుషం
- గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసిన వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, మహిళలు

ఆమదాలవలస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ లేదని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని కంచ్రపేట జంక్షన్‌లోని గాంధీ విగ్రహం వద్ద పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చిగురుపల్లి ధనలక్ష్మి అధ్యక్షత సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కృష్ణా జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ ముప్పాళ్ల హారికపై టీడీపీ, జనసేన గూండాలు దాడి చేయడం అమానుషమన్నారు. మహిళ అని కూడా చూడకుండా విచక్షణా రహితంగా ప్రవర్తించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో ఎక్కడ చూసినా హత్యా రాజకీయాలు, మహిళలపై దాడులు, అక్రమాలు పెరిగిపోయాయన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ ప్రజలను హింస్తున్నారన్నారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. ధనలక్ష్మి మాటాడ్లతూ.. ఇటువంటి పాలన గతంలో ఎన్నడూ చూడలేదని, కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు రోడ్డుపైకి రావాలంటే భయపడేలా చేస్తున్నారన్నారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, కూటమి పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొడ్డేపల్లి అజంతాకుమారి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, పార్టీ నాయకుడు దుంపల శ్యామలరావు, సత్యనారాయణ, సంజయ్‌కుమార్, బి.వి.రమణమూర్తి, చింతాడ వెంకటరమణ, ఎస్.రామారావు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం



నరసన్నపేట: ర్యాలీలో పాల్గొన్న జడ్జి, పోలీస్ అధికారులు, న్యాయవాదులు

నరసన్నపేట: మధ్యవర్తిత్వంతో కేసులు సులువుగా పరిష్కరించుకోవచ్చని, కక్షిదారులు సానుకూలంగా స్పందించాలని నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి అన్నారు. ఈ మేరకు కోర్టు నుంచి కంబకాయ కూడలి వరకు న్యాయవాదులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేసులు పరిష్కారమైతే కక్షిదారులకు సమయం కలిసి వస్తుందని, డబ్బు ఆదా అవుతుందన్నారు. నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్, ఏపీపీ సంతోషి, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం..

పొందూరు: ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించేందుకు సుప్రీం చేపట్టిన ‘మధ్యవర్తిత్వం–దేశం’ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పొందూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. పొందూరు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం విలేకర్లతో మాట్లాడారు.

జూలై 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ముగ్గురు న్యాయవాదులు అందుబాటులో ఉంటారన్నారు.

సబ్‌జైల్ తనిఖీ..

నరసన్నపేట: నరసన్నపేట సబ్‌జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు కె.హరిబాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. జైల్లో సదుపాయాలు, ఆహార పదార్థాల నాణ్యత, మెనూ అమలు, తదితర అంశాలపై ఆరా తీశారు. ఉచిత న్యాయ సలహాలు కావాలంటే న్యాయవాదిని సమకూర్చుతామన్నారు. అవసరమైనవారు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ద్వారా దరఖాస్తును న్యాయ సేవాధికార సంస్థకు పంపాలన్నారు. ఆరోగ్యం, పరిసరాల ప్రాధాన్యత గురించి వివరించారు. నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి పాల్గొన్నారు.

న్యాయ సేవలు సక్రమంగా అందాలి

పాతపట్నం: స్థానిక సబ్ జైల్‌లో ఉన్న ఖైదీలకు న్యాయ సేవలు సక్రమంగా అందేలా చూడాలని జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.హరిబాబు అన్నారు. పాతపట్నం సబ్ జైల్‌లో జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సును సోమవారం నిర్వహించారు. సబ్ జైల్ వంటగది, స్టోర్ రూమ్, గ్రంథాలయం, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్ ఎం.సన్యాసిరావు, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మా పొట్ట కొట్టొద్దు

- ఆ భూములే మాకు జీవనాధారం
- జమ్ము గ్రామ ఎస్సీ రైతుల ఆవేదన



మాట్లాడుతున్న జమ్ము గ్రామ ఎస్సీ రైతులు

నరసన్నపేట: ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈ పార్క్ కోసం తమ భూములు లాక్కోని, తమ పొట్ట కొట్టొద్దని జమ్ము గ్రామానికి చెందిన ఎస్సీ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నరసన్నపేటలో విలేకర్లతో మాట్లాడారు. జేసీని, శ్రీకాకుళం ఆర్డీఓను కలిసి తమ విజ్ఞప్తిని తెలియజేశామన్నారు. తమ భూములు తీసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను నిలుపుదల చేయాలని విన్నవించామన్నారు. 45 ఏళ్ల క్రితం ఆ భూములు తమకు అప్పటి ప్రభుత్వం ఇచ్చిందని, వాటిని సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్నామన్నారు. పిల్లలను చదివించుకుంటున్నామని, ఇప్పుడు ఆ భూములు పోతే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తమ భూములు కాకుండా, ఇతర భూములు సేకరించాలని కోరారు. దీనిపై జేసీ, ఆర్డీఓలను కలిస్తే.. వారు సానుకూలంగా స్పందించారన్నారు. తమ అంగీకారం ఉంటనే భూములు సేకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ప్రభుత్వం దుందుడుకు చర్యలు తీసుకుంటే తాము ఆందోళనలకు సిద్ధపడతామని ఎస్సీ రైతులు కొంగరాపు త్రినాథరావు, సుక్క చిన్నమ్ముడు, టి.రాజారావు, గంగరాపు సింహాచలం, తదితరులు హెచ్చరించారు.

భూ యాజమాన్య హక్కులు కల్పించాలి..

గతంలో ప్రభుత్వం తమ జీవనాధారం కోసం ఇచ్చిన భూములకు పూర్తిగా యాజమాన్య హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 20 ఏళ్లకు పైగా సాగు చేస్తే భూ యాజమాన్య హక్కులు కల్పించాలని ప్రభుత్వ నిబంధనల్లో ఉందన్నారు. 40 ఏళ్లుగా సాగు చేస్తున్నా భూ యాజమాన్య హక్కులు కల్పించడం లేదని వాపోయారు. జిల్లా అధికారులు స్పందించి తాము సాగు చేస్తున్న భూములను తమ పేరుపై భూ యాజమాన్య హక్కులు కల్పించాలని కోరారు.

వీఏఏల పని తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



వీఏఏలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: మండలంలోని తొగరాం రైతు సేవా కేంద్రం విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ సత్యసాయితోపాటు మరో పది మంది వీఏఏలపై ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు.

ఉద్యోగుల నిర్లక్ష్య ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ శాఖ నివేదికపై ఏఓ మెట్ట మోహన్‌రావు మాట్లాడుతూ.. రైతులందరికీ వరి విత్తనాలు అందజేశామని, ఎరువులు సరఫరా చేస్తున్నామన్నారు. సుమారు 400 క్వింటాళ్ల వరి విత్తనాలు తిరిగి ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. రైతులకు కావాల్సిన వరి విత్తనాలు తీసుకురాలేదని, ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేసుకున్నారని గాజులకొల్లివలసకు చెందిన వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు మొండేటి కూర్మారావు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎరువులు కూడా అరకొరగా అందిస్తున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. వీఏఏలను సమావేశ మందిరంలోకి పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. తొగారాం రైతుల వద్ద ఎరువుల కోసం వసూలు చేసిన నగదును ప్రభుత్వానికి సక్రమంగా చెల్లించలేదని వెల్లడవంతో సదరు ఉద్యోగిపై రిపోర్టు సిద్ధం చేసి జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు పంపించాలన్నారు. సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలని తానే జేడీకి సిఫార్సు చేస్తానన్నారు. పలు శాఖల పనితీరుపై చర్చించారు. జెడ్పీటీసీ బెండి గోవిందరావు, ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, సభ్యులు నూక అప్పలసూరనాయుడు, ననపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, అన్నెపు భాస్కరరావు, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

18న మండల సమావేశం

సరుబుజ్జిలి: ఈ నెల 18వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.పావని సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షత వహిస్తారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఇసుక అక్రమ తవ్వకాన్ని అరికట్టాలి

కొత్తూరు: మండలంలోని వసప గ్రామ సమీపంలో గల వంశధార నదిలో చేపడుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని వైఎస్సార్‌సీపీ పాతపట్నం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు అగతమూడి నాగేశ్వరరావు సోమవారం అధికారులను కోరారు. కొత్తూరులో విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుమతులను ఒకచోట ఇస్తే.. తవ్వకాలు మరోచోట చేస్తున్నారన్నారు. టీడీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి అక్రమ తవ్వకాలు చేస్తున్నట్లు ఆరోపించారు. అక్రమ తవ్వకాలను అరికట్టాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు పట్టించుకోకపోతే ఈ ప్రాంత రైతులుతో కలిసి ఆందోళన చేస్తామన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఆమదాలవలస: ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. ఆమదాలవలస పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలు, గొడాములను సోమవారం తనిఖీ చేశారు. పలు గొడాంలలో ఉన్న సరుకుల్లో హెచ్చుతగ్గులు ఉండటాన్ని గుర్తించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని దుకాణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అవసరంలేని ఎరువులు, పురుగు మందులు అంటగట్టడంపై ఆరా తీశారు. ఆధార్ కార్డులపై ఎరువుల బస్తాలు రైతులకు అందిస్తున్నామని దుకాణదారులు చెప్పడంతో.. అలా చేయవద్దని వన్–బీ, అడంగల్ తీసుకువస్తే ఇవ్వాలని జేసీ ఆదేశించారు. ఆమదాలవలస ఏఓ మెట్ట మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం

బూర్జ: మండలంలోని డొంకలపర్త గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చందక సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ స్పీకర్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాం సోమవారం పరామర్శించారు.

కొండపేటకు చెందిన వావిలాపల్లి గోవిందరావుకు ఇటీవల ఆపరేషన్ అయింది. ఆయనను పరామర్శించి, వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గుమ్మడి రాంబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరామ్‌నాయుడు, నాయకులు వావిలాపల్లి మురళి, తొత్తడి సురేష్, వియ్యపు కృష్ణ, తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న తహసీల్దార్ బాలకృష్ణ, నాయకులు

కొత్తూరు: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద అలికాం–బత్తిలి రోడ్డులో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డును బాగు చేయాలని సాక్షిలో పలుసార్లు వార్తలు ప్రచురించడం జరిగింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కాలువల (డ్రైనేజీల) నిర్మాణ పనులు మంజూరు చేశారు. ఈ పనులను తహసీల్దార్ కె.బాలకృష్ణ, పడాల లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్

బెడ్ షీట్లు పరిచారు..



బెడ్లు మీద వేసిన షీట్‌లు

కొత్తూరు: కొత్తూరులోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో బెడ్ షీట్ రూమ్‌కు తాళాలు అనే వార్త సాక్షిలో సోమవారం ప్రచురితమైంది. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ అనురాధ స్పందించారు. ఆస్పత్రిలో ఉన్న అన్ని బెడ్లపైనా బెడ్ షీట్లు వేయించారు. బెడ్లపై ఆదివారం షీట్లు ఎందుకు వేయలేదని, రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని సంబంధిత సిబ్బందిని పిలిచి సూపరింటెండెంట్ ఆదేశించారు. బెడ్‌షీట్లు వేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృత్తం కాకూడదని హెచ్చరించారు.

మున్సిపల్ కమిషనర్‌గా తమ్మినేని రవి

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్‌గా తమ్మినేని రవి మంగళవారం బాధ్యతలు చేట్టనున్నట్లు కార్యాలయ సిబ్బంది సోమవారం తెలిపారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన పూజారి బాలాజీప్రసాద్ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. తమ్మినేని రవి ఆమదాలవలసలో గల వేంకటేశ్వస్వామి దేవస్థానం ఈఓగా ఇంతవరకు పని చేశారు.

నేడు ఆవేటి వారాలు

పాతపట్నం: ఈ నెల 15వ తేదీన మండల కేంద్రంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆవేటి వారాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. ప్రతీ సంవత్సరం రైతులు వరి విత్తనాలు వేసిన తరువాత ఆవేటి వారాలు చేయడం అనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. అమ్మవారికి ముర్రాటలు, నెయ్యి ముద్దలను సమర్పిస్తామన్నారు.

ఆలయ స్థలం ఆక్రమణకు యత్నం..?

- కమిటీ చేపట్టిన నిర్మాణ పనులు అడ్డగింత
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కమిటీ సభ్యులు



ఆలయం పక్కన ప్రహరీ నిర్మాణానికి పరిశుభ్రం చేసిన కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: పట్టణంలో ఒకవైపు ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఆక్రమణలకు గురవుతుండగా, మరోవైపు విలువైన ఆలయ స్థలాలు సైతం కాజేసేందుకు ఆక్రమణదారులు పాల్పడుతున్నారు. స్థానిక పెద్దపేట కూడలిలోని శక్తి ఆంజనేయ స్వామి గుడికి 150 ఏళ్ల చరిత్ర ఉంది. దీనికి ఆనుకొని 10 అడుగుల వెడల్పు, 70 అడుగుల పొడవుతో ఆలయానికి చెందిన స్థలం ఉంది. ఇటీవల దీనికి చుట్టూ ప్రహరీని నిర్మించేందుకు దాతలు విరాళాలు ఇచ్చారు. ఈ పనులు చేపడుతుండగా గుడికి సమీపంలోని ఒక వ్యక్తి ఈ స్థలం తనదని కమిటీ చేపడుతున్న పనులు అడ్డుకున్నాడు. అలాగే అప్పటివరకు జరిగిన పనులను జేసీబీతో కూల్చివేశాడు. అయితే ఇది పక్కాగా దేవాలయానికి చెందిన స్థలమని, ఇప్పుడు స్థలం విలువ పెరగడంతో దానిని కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఆలయ భూములకు కూడా రక్షణ లేకుండా పోతోందని వాపోతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు

ఆలయానికి చెందిన స్థలం కాపాడుకోవడానికి కమిటీ ప్రతినిధులు ముందుకు వచ్చారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ గ్రీవెన్స్‌కూ ఫిర్యాదు చేస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు పొట్నూరు కృష్ణప్రసాద్, మచ్చ శాంతలు తెలిపారు. ఈ స్థలం ఆలయానికి చెందినదేనని, ఏళ్ల తరబడి ఆలయం స్వాధీనంలోనే ఉందని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకొని ఆలయ స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు. మరోవైపు పోలీసులు దీనిపై విచారణ చేస్తున్నారు.